కథానిక

# పద్మవ్యూహం

రంధి సోమరాజు

వెంకట్రావు చాలా సౌమ్యుడు. అయితే ఇతరులాతని మంచితనాన్ని తమ స్వలాభానికే ఉపయోగించుకుంటున్నారు గాని ఆ మంచితనాని కీయవలసిన స్థానాన్ని మాత్రం వాళ్ళెప్పుడూ ఇచ్చిన పాపాన పోలేదు.

వెంకట్రావు, వచ్చే నూటయాభై రూపాయలూ చాలా జాగ్రత్తగా వాడుకుంటాడు. ఇంట్లో ఉండేది భార్యా, తనే కాబట్టి అతని కాట్టే ఖర్చుకూడ లేదు. ఆతను ప్రతినెలా కనీసం ముప్పైరూపాయలైనా మిగల్చవచ్చు. కాని అతనెప్పుడూ అట్లా చేసిన పాపాన పోలేదు. ఎవరో ఒకరు ఆ మిగిలిన కాస్తనూ అప్పుగా పుచ్చుకొని చప్పగా ఎగేస్తున్నారు.

“ఆపదలో ఉన్నాను. ఇప్పుడు ఆదుకోకపోతే నాకిక అథోలోకమే” అంటూ ఓ మిత్రుడు వస్తాడు. అయితే ఇతను వెంకట్రావుకు మిత్రుడుగా వేషంవేసి అట్లా చలామణీ అయిపోతూన్నది—కనీసం ఓ వారంరోజులైనా అయివుండదు. అయితే ఇలాంటి వాళ్ళకందరకూ ఎందుకిస్తావయ్యా అని ఓ శ్రేయోభిలాషి అంటే, “ఏమిటో అలావచ్చి అడిగినప్పుడు మాట తియ్యలేక పోతున్నాను” అంటాడు. అసలు ఈ మాట తియ్యలేక పోవడమనేది అన్ని జబ్బుల్లోకీ చాలా పెద్ద జబ్బని ఆతనికి తెలియదేమో పాపం! పోనీ ఇది వాళ్లు గ్రహించి, అతని సొమ్ము తిరిగి ఎప్పుడైనా ఇచ్చేస్తారా అంటే, అది కలలోని మాట! సరే ఇక వెంకట్రావు వాళ్ళనెప్పుడైనా అడుగుతాడా అంటే అదీ సున్నే. “పుచ్చుకున్న వాడి కుండాలి గాని” అంటాడు.

“సరి సరి! అంత నీతిగా ఏడ్చేవాళ్ళెప్పుడెక్కడున్నారయ్యా” అంటే “సరే ఏం చేస్తాం” అంటూ అమాయకంగా పెదవి విరుస్తాడు. ఇత నిట్లాంటివాడని వాళ్ళకు బాగా తెలిసే, “నీడబ్బు పువ్వుల్లో పెట్టి ఫలానారోజున ఇచ్చేస్తాను బ్రదర్” అనడం—ఇక పువ్వుల్లో పెట్టి కాదుకదా కనీసం రాళ్లల్లో పెట్టి ఇచ్చినా ఫరవాలేదు; కాని అలాకూడా ముట్టజెప్పకపోవడం—ఇక పూర్తిగా మరచిపోయినట్లు నాటకం మొగాలుపెట్టడం చేస్తున్నారు. ఈ మధ్యలో వెంకట్రావు కనిపిస్తే, ఎంతో ప్రేమ ఏడ్చి చచ్చినట్టు “కులాసాండి” అనడం, అలా అనగానే వెంకట్రావు వెర్రిగా, “నా డబ్బు మాటేమిటి” అన్నట్టు చూడటం వాళ్లు “నీ డబ్బుమాట దేవుడెరుగు, మాకు నువ్వెక్కడ దాపురించావయ్యా” అని మనసులోనే అనుకొని, “వస్తానండీ” అని మొగంలోకి లేని నవ్వు కక్కుకొని అక్కడ నుంచి చల్లగా ఉడాయించడం చేస్తారు.

ఓసారి వెంకట్రావుకు ఓ లెక్చరర్ గారు కలశారు. అదే సమయంలో, అతని పాత మిత్రుడొకడు, ఆ లెక్చరర్ గారికి వెంకట్రావుగురించి అద్భుతంగా చెప్పేశాడు. “ఈ ఊళ్లో ఇంత కల్చరున్న పెద్దమనిషి మరొకరు లేరంటే నమ్మండి” అన్నాడు. వెంకట్రావు ఇది ఏ ఆపదకు సూచనో అనుకున్నాడు. “మీవంటివారి పరిచయంకలగటం మాభాగ్యమండీ” అంటూ లెక్చరర్ గారు అక్కడనుంచి కదలిపోయారు. ఆయన చాల దూరదృష్టితోనే ఆ భాగ్యమన్న పదం ఉపయోగించాడా అని వెంకట్రావు అనుమానంలో పడిపోయాడు. ఈ స్నేహం కలసి నెల రోజులు తిరక్కముందే, ఆ లెక్చరర్ గారు, హడావుడిగా వెంకట్రావు దగ్గరకు దయచేసి, “వెంకట్రావుగారూ, మీకు చాలా ఇబ్బంది ఇస్తున్నాను. మరేమీ అనేకోకుండా ఒక్క పాతిక రూపాయలుంటే ఇవ్వండి. ఎల్లుండి ఫస్టు తారీఖున ఇచ్చేస్తాను” అన్నాడు. వెంకట్రావుకేమనాలో తోచలేదు. ఆతను ఓ క్షణం అట్లాగే మాటామంతీ లేకుండా ఉండిపోయాడు. ఈ

రోగానికి తక్షణం మందువేయాలన్న బుద్ధి ఉన్న ఆ ఉపన్యాసాల డాక్టరుగారు, "మీకు నయమండీ ఏ ఖర్చులూలేవు. మీరసలు కాఫీ అయినా త్రాగరు. సరే ఇహ సిగరెట్లు ముట్టనే ముట్టరు. సినిమాలుకూడ ఆటే చూడాలన్న ఆత్రుతకూడా లేదు. ఇన్ని గుడ్ హేబిట్సు ఒకళ్లలో మూర్తీభవించడం చాలా అరుదుగా చూస్తామండీ. నిజంగా ఇంత నియమంగా ఉండటం ఏదో మీ లాంటి మహర్షులకుగాని మాబోటివాళ్ళకు బ్రహ్మప్రళయమేనండి! ఏమిటో ఎన్ని సార్లనుకున్నాను; వెధవది ఈ పాడు సిగరెట్లకు స్వస్తి చెప్పాలని కానీ, ఒక్కక్షణం కాల్చకుండా ఉండలేని అసమర్థుడనైపోయాను. ఇహ కాఫీ లేకపోతే సరే సరి, ప్రాణాలు వాటిదారినవి చూసుకుంటాయి" అంటూ నవ్వుమొగంతో లెక్చరర్ గారు కాస్త ఆగారు.

వెంకట్రావు, "ఇవన్నీ దుర్గుణాలని తెలిసి ఉండికూడా, మీవంటి పెద్దలే వాటి జోలికి పోకుండా ఉండలేని అశక్తులైపోయి. గిలాగిలా కొట్టుకుంటూన్నప్పుడు — ఇక సామాన్యుల సంగతి ఏం చెప్పగలం? నిజంగా ఆ కల్లు త్రాగే వాళ్ళకు దాన్ని మానమనటం చాల పాపమేమో!" అని అనాలనుకున్నాడు. కాని అంత పెద్దమనిషిని పట్టుకొని అలాగులిపెయ్యడం ఏమీ బాగుండదనుకున్నాడు. ఈ తన బలహీనతకెంతో బాధ పడ్డాడు. ఇక తనదగ్గర ప్రస్తుతం ఏమీ లేదని చెప్పేస్తే వదలిపోతుందిగొడవ అనుకున్నాడు. కాని, "ఫస్టుతారీఖున ఇచ్చేస్తానన్నాడుగా. పోనీ ఇచ్చి చూస్తే ఏంపోతుంది" అనుకొని; "ఇంత పెద్దమనిషి ఇస్తే ఎగేస్తాడంటావా? ఏమిటో చూడగా చూడగా డబ్బు చేతికందిన తరువాత ఒక్కడూ పెద్ద మనిషిలా కనిపించడమే లేదు. ఇచ్చేస్తాం అని ఒక్కమాట అనడమేగాని మరేమీ లేదు. ఏమిటో ఈ ఒక్కమాటే వీళ్ళకు ఆ అడుక్కునే వాళ్ళనుంచి వేరు చేస్తూంది. అసలు వాళ్ళకూ వీళ్ళకూ ఇంతకన్నా భేదమేముంది? ఈ మెహర్బాణీగా అడుక్కు బ్రతికేజాలికిచ్చేబదులు ఆ పేదవాళ్ళకు దానంచేసినా బాగుండేది! ఈవిలాసాలకు ఖర్చుపెట్టే వాళ్ళకు, క్లబ్బుల్లో పేకాట్లకు తగలేసే పెద్దమనుష్యులకు ఇస్తే తిరిగివచ్చేది ఏమీలేకపోగా పైపెచ్చువాళ్లు తిరిగిఏరోజూనైనా, మళ్లీఅప్పడిగితేఆనాడు తనదగ్గర నిజంగాడబ్బులేక పోవడంవల్లనే లేదంటే తనేదోడబ్బుండేవాళ్లదగ్గర అలా నాటకమాడుతూన్నట్టు "పారిపోం లెండీ. అదీఇదీ కలిపి ఒక్కసారే ఇచ్చేస్తాం"అంటారు. "అచ్చే లేదు. నిజంగా నాదగ్గర ఇప్పుడేమీలేదు" అంటే ఇలా ఆ అడిగినవాడు ఇంతకుముందెప్పుడు అప్పు పుచ్చుకున్న పాపాన పోనట్టు, ఆ వేళ నోరు విడిచి అడిగితే "ఇన్సల్టు" జరిగినట్టు మొగం పెట్టి, "సరేలెండి. వస్తాను" అంటూ దారితీస్తాడు. ఇలా జరిగిన తరువాత వాడు చస్తే తననెప్పుడూ పలకరించడమైనా లేకపోగా, "నీ మొఖం చూస్తే పాపం కూడా చుట్టుకుంటుంది" అన్నట్లుగా నటిస్తాడు ఇదంతా తలలో తిరుగుతూన్న వెంకట్రావు, ఏ విషయమూ ఆ లెక్చరర్ గారికి జవాబు చెప్పకుండా అలా ఏదో ఆలోచిస్తూన్నట్టుగానే ఉండిపోయాడు. ఇక ఆ లెక్చరర్ గారు ఊపిరి బిగపెట్టుక కూర్చున్నారు; వెంకట్రావు మొఖంలోని కదలికలన్నీ పరిక్షగా అప్పుడప్పుడు దొంగలా చూస్తూ. కాని పాపం ఆయన ఈ మౌనం ఎంతసేపని భరించగలడు? అంచేత, "పోనీ ప్రస్తుతం మీ చేతిలో లేకపోతే మరేమీ బాధపడకండీ" అన్నాడు; వెంకట్రావు తనగురించి బాధపడటం కించిత్తూ ఇష్టం లేనట్టు. ఇది వినగానే వెంకట్రావు చప్పగా మెత్తబడిపోయాడు. ఆమాటకు పూర్తిగా లొంగిపోయాడు. అలా లొంగిపోయి, "అంత లేదండీ... ఓ పదిహేను కావలిస్తే ఇస్తాను" అన్నాడు. అసలు లెక్చరర్ గారికి కావలసినవి పదే కాబట్టి, "సరే అలా ఇవ్వండి" అన్నాడు. ఆ మిగిలిన పదీ ఇంకెక్కడైనా ప్రయత్నిస్తానన్నట్టుగా. అంతే. ఆ లెక్చరర్ గారు వాటిని పట్టుకెళ్ళిన తరువాత ఎన్ని ఫస్టు తారీఖులు చింపేసారో! కాని ఆ కనబడని బాకీ పత్రాన్ని మాత్రం ఆ వెంకట్రావు మనసులోంచి ఆయన చింపలేకపోయాడు.

ఆవేళ చికాగ్గా ఉన్నాడు వెంకట్రావు. ఏదో పుస్తకం చదవాలని తీశాడు. కాని ఏమీ తలకెక్కక దాని పేజీలనలాగే తిప్పుతూ కూర్చుండిపోయాడు. ఇంతలో ఎవరో వచ్చి, "నాయనా వెంకట్రావ్" అని కేకవేశారు. వెంకట్రావు లేచి గబగబా గుమ్మంలోకి వెళ్ళి, "ఓహోహో

పుల్లయ్యగారా...ఎప్పుడూ రాక? అమలాపురం నుంచేనా?" అన్నాడు. పుల్లయ్యగారు ఓ కుర్చీలో కూర్చుంటూనే "క్షేమమా నాయనా" అన్నాడు. "ఏదో మీ దయవల్ల" అన్నాడు వెంకట్రావు అలా అనాలి కాబట్టి. ఇక ఆయన "మా అన్నయ్యావాళ్ళూ అంతా బాగున్నారోయ్. మీ అమ్మ, నిన్ను నేను చూడకుండానే వచ్చేస్తానని అనుకుంది కాబోలు తప్పకుండా చూసి రమ్మని మరీమరీ చెప్పింది" అని అంటూ "ఆ...ఇంతకీ ఉద్యోగం అదీ బాగా సాగుతూ ఉన్నట్లేనా? అయితే ఇంతకీ ఆ జీతం రాళ్ళు సరిపోతున్నట్లేనా, లేక యింటి దగ్గరనుంచి అడపాదడపా మనియార్డర్లు రప్పించుకుంటున్నావా? అసలు ఈ పాడురోజుల్లో ఎంతిచ్చినా ఏం చాలుతుందిలే మా అల్లుడు చూడు నూట అరవై తెచ్చుకుంటున్నాడా— నెల తిరిగేప్పటికి ఎర్రని ఏగాణీ మిగల్చడు. ఎప్పుడూ డబ్బు పంపమని, వచ్చినప్పుడల్లా డబ్బేదని వేపుకుతింటాడు. ఏమిటో? ఇహ ఈ సంసారాలిలావుంటే ఏం ముందుకొస్తాయ్? నీకూ ఆ నూటయాభైయ్యో యెంతో వస్తున్నాయనే విన్నాను. ఆ... అంతేనా? అవును నూటయాభయ్యే. ముసలివాళ్ళమౌతున్నకొద్దీ మరుపెక్కువౌతూంది. రాత్రేగా మా అల్లుడు చెప్పాడు. అప్పుడే మరచిపోయాను. ఇంతకీ ఏమైనా వెనకేస్తున్నట్లేనా? లేక నువ్వూ ఈ పట్నంగాలిసోకి తగలేస్తున్నావా? ఏది ఎలాగైనా నువ్వలాంటి వాడివి కాదులే. నాకు తెలుసుగా నీ తత్వం. అసలిప్పుడు ఈ వయసులో మిగల్చకపోతే ఇంకెప్పుడు మిగులుస్తారూ అంట? అంతే నంటావా కాదా? అసలు నువ్వలా దిగాలుగా ఉన్నావేం? ఏం వంట్లో బాగాలేదా ఏమిటి?" అని తాపీగా ఆయన వెంకట్రావును పరామర్శ చేశారు. "అబ్బే. కులాసాగే ఉన్నానండీ" అన్నాడు వెంకట్రావు అయితే ఈ మాట ఆయన నమ్మనట్టుగా, "అయితే తెలియక అడుగుతాను. నిన్ననందుకున్న జీతం అప్పుడే హారతి కర్పూరం అయిందేమిటి? నీ మొఖం చూస్తే అలాగే ఉంది" అని ఆయన అనగానే వెంకట్రావు, "అబ్బే. అప్పుడే ఎందుకయిపోతుందండీ" అన్నాడు బోళాబోళీగా. వెంటనే ఆ పుల్లయ్యగారు, "ఆఁ అయితే ఫరవాలేదులే. కాని మా వాడు చూశావా, నిన్ననందుకున్న జీతం మరేం చేశాడో-అప్పుడే అయిపోయిందంటాడు. ఇంక ఇలాంటి వాడితో ఎలా బ్రతుకుతుందిరా అది. నేరకపోయి వాడికిచ్చాను. ఇప్పుడది నానా హింసలూ పడుతూంది. ఆ పిల్లల్నేనా సరిగ్గా చూస్తాడా అంటే అదీ ఉత్తదే. ఏమిటోవాళ్ళకు సరైన బట్టలూ అవీ ఉండవు. అదిచూస్తే ఎప్పుడూ ఉసూరుమంటూ ఉంటుంది. ఇక ఇంటికొచ్చిన ప్రతీ సూటువాలాకీ కాఫీలు తయారు చెయ్యలేక ఒకటే చస్తుందనుకో" అనివాగేస్తూ చప్పున ఆయన ఆ మాటల ధోరణి తగ్గించేసి, రహస్యం చెప్తూన్నట్టుగా, "సరేకాని వెంకట్రావూ ఎలావోయ్ మా అల్లుడితో చచ్చే బాధొచ్చింది. ఇప్పుడు నన్ను నిలుచున్నపళంగా వందరూపాయలు అర్జంటుగా పనొచ్చిందని తెమ్మంటాడు. ఎలా చెప్పు. యేదో నువ్వు మన ఊరివాడివి ఉన్నావు కాబట్టి సరిపోతుందనుకో........." అంటూ వెంకట్రావు సుముఖంగా ఉన్నాడా లేదా అనే విషయం పరీక్ష చేయడానికా అన్నట్టు ఆయన ఆగిపోయాడు. వెంకట్రావు ఒకసారిగా నిర్ఘాంతపోయాడు. పుల్లయ్యగారి మాటలు ఒక్కటొక్కటిగా ఆతని తలలో తిరగటం మొదలుపెట్టాయి. "ఆరి వీడి దుంపతెగా. నాజీతం ఎంతో నిర్ధారణ చేసుకొని, అది పట్నం అలవాట్లకు బలి అయిపోతూందనే సాకుతో అప్పివ్వడం మానేస్తానేమోనని, అట్లాంటిది జరక్కుండా మార్గం సరిజేసుకొని, అందిన జీతం అందినట్లుగానే ఉందని బుజువుపరచుకొని, ఎట్లా తన కోర్కె సఫలం చేసుకోబోతున్నాడూ! ఎంతద్భుతంగా వ్యూహం పన్నాడూ. ఈ పద్మవ్యూహంలోంచి ఇక తప్పించుకో లేననుకున్నాడు కాబోలు." అని అనుకుంటూ ఆ పుల్లయ్యగారితో ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఈ మౌనం సహించలేని ఆ ముసలాయన, "నువ్వు ఇహ ఈ మాట దక్కించాలి. ఈ వందరూపాయలూ నేను ఏడో తారీఖున అమలాపురంవెళ్ళగానే మనియార్డరు చేసేస్తాను" అన్నాడు వెంటనే వెంకట్రావు, "మీకు వందరూపాయలూ ఇవ్వడానికి నాకే అభ్యంతరమూ లేదు కాని, అసలు నేను మీకెందుకివ్వాలీ?" అన్నాడు ముసలాయన ఈ ధోరణి ఏమిటో అర్థంకానట్టుగా ప్రశ్నార్థకపు చూపులుచూశాడు

కాని వెంకట్రావు "ఏమండీ, చెప్పరేం" మీా కెందుకివ్వాలి? మీారు నన్ను నమ్మలేదు కదా. నేను మిమ్మల్ని ఎందుకు నమ్మాలి?" అన్నాడు. ముసలాయన "అదేమిటీ అలా అంటున్నావు. నిన్ను నమ్మకపోవడమేమిటీ?" అన్నాడు.

వెంటనే వెంకట్రావు, "ఆఁ అదే. ఇంకోసారి మీారు మాట్లాడిన పద్ధతంతా ఇంటికిపోయి తీరుబడిగా కూర్చుని ఓ సారి నెమరువేసుకోండి తెలుస్తుంది" అన్నాడు కటువుగా.

ముసలాయన జన్మలో ఇట్లాంటి పరిస్థితి నెదుర్కోనేలేదు. కాని ఏం చేస్తాడు? ఇక ఇంటికి వెళ్లక తప్పిందికాదు. కాని వెళ్లుతూ వెళ్లుతూ, "ఇదిగో వెంకట్రావ్; నువ్వూ సరిగ్గా మాబాబువే అనిపించుకున్నావ్ వాడూ ఇలాగే మూర్ఖుడులా మాట్లాడేవాడు" అని అనగానే, వెంకట్రావు "ఔనౌను పుల్లయ్యగారూ. అందకపోతే ద్రాక్ష పళ్ళు పులుపే. మీా వ్యూహంలో మేం చిక్కకపోతే మరి మూర్ఖులమే" అనేప్పటికి ముసలాయన గొడుగుచంకను పెట్టుకొని విసురుగా అక్కడనుంచి ఇంటికి వేంచేశాడు.

అదేమిటోగాని ఈ సంఘటన జరిగిన తరువాత వెంకట్రావు ఒక్కరికి అప్పిచ్చిన పాపాన పోలేదు. నిజంగా ఈ పాపమంతా పుల్లయ్యగారిదే అనాలి. ఏమంటారు?

**కథానిక**

# మనస్సాక్షి

జానకీరావు

టెగార్ట్ లేచి కూర్చున్నాడు. సూర్యోదయమైంది. హైడ్ పార్కులోని చెట్టుమీాది మంచు బిందువులు సూర్యకాంతితో ముత్యాల్లా మెరుస్తున్నాయి. పక్షులు మధుర ధ్వనులు చేస్తున్నవి. ఈ ప్రకృతి సౌందర్యమంతా చూచి ఆనందించే స్థితిలో లేడు టెగార్ట్. తెల్లారగానే కడుపునిండే అవకాశం వున్న వ్యక్తికి పక్షుల గానం మృదుమధురంగా తోస్తుంది. కాని, టెగార్ట్‌వలె దైన్య స్థితిలో వున్నవాళ్లకి ప్రకృతి శోభ ఆనందం కలిగించదు, పక్షుల పలుకులు ఆహ్లాదాన్నివ్వవు. రాత్రికి తలదాచుకునే చోటు లేక, చలితో బాధపడుతూ టెగార్ట్ మొదటిసారిగా హైడ్ పార్కులో నిద్రించాడు. టైమెంతైందో చూదామని చేయి చూచుకున్నాడు. కాని ఒక వారం క్రిందటే చేతి గడియారం అమ్మేసిన విషయం అతనికి జ్ఞప్తికొచ్చింది. అన్ని వస్తువులు అమ్మిన తరువాత, చివరికి తిండికోసమని గడియారం అమ్మాడు.

మూడు నెలల క్రింద తన పరిస్థితికి - ప్రస్తుతం తన పరిస్థితికి ఎంత అంతరం వుందో మనస్సుకి తోచగానే, టెగార్ట్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

మూడు నెలల క్రిందటి ఒక ఉదయం టెగార్ట్ "కంగ్లోమెరేటెడ్ జనరల్"లో పని చేస్తున్నాడు. "లైట్‌హౌస్" పత్రిక సంపాదకుడు టెగార్ట్‌ని చిరునవ్వుతో ఆహ్వానించాడు. "టెగార్ట్! మన పత్రికకి జార్జిగ్రీన్ ఒక వ్యాసం యిస్తానన్నాడు. అతనికి వ్రాయడానికి తీరికుండదని నీకు తెలుసుగదా! హాస్యం కొద్దిగా మిళితం చేసి సుమారు పేజీకి సరిపడ వ్రాయి. గ్రీన్ సంతకం పెడతాడు. ఈ దెబ్బతో మన పత్రికకు మంచిపేరొస్తుంది" అన్నాడు సంపాదకుడు. టెగార్ట్ నవ్వాడు.

"అతను జన్మలో ఒక్క వాక్యమైనా వ్రాసి వుంటాడా?" అన్నాడు టెగార్ట్ నవ్వుతూనే.

"అలాంటి ఆలోచనలు రానివ్వడం తప్పు టెగార్ట్. అతనెలా వ్రాయగలడో నీకు తెలిసే వుంటుంది. ఏమైనా కానీ, నువ్వు త్వరగా పూర్తి చేసెయ్యాలి. సంపాదకీయం చూశావా?" అన్నాడు సంపాదకుడు. టెగార్ట్ జేబులోంచి కొన్ని కాగితాలు తీశాడు.

"చూశాను. కొద్దిగా సరిచేస్తే బాగుంటుందనిపిస్తోంది. చేయమంటారా?"

"తప్పకుండానూ. నాకు అవసరమైన పని వుంది. మళ్ళా శుక్రవారంగాని రాను. గ్రీన్ వ్యాసం, సంపాదకీయం తయారు చెయ్యి" అంటూ జవాబుకైనా ఎదురుచూడకుండా సంపాదకుడు కోటు తొడుక్కుని పరుగెత్తాడు.

టెగార్ట్ వ్రాయడానికి కూర్చున్నాడు. ఏం